# అక్కా! బావచ్చేరే!

శ్రీ నాయుడు వెంకటసీతారామమూర్తి

“అక్కా! బావచ్చేరే!” అంది లక్ష్మి గబగబా పరిగెత్తుకుంటూ వస్తూ. వంటింట్లో కూర్చుని కూరగాయలు కోస్తున్న నాకు యీ సంగతి వినడంతోటే ఆనందంతో పాటు కొంచెం కంగారుకూడా కలిగింది.

“నిజంగానా? వారొచ్చేరా?” పరిగెత్తుకు వెళ్లి పలుకరిద్దామంటే చెప్పలేనంత సిగ్గేసింది. అవునుమరి! పెళ్లయి యింకా నెల పూర్తికాలేదు. వచ్చీరావడంతోటే ఎదురుగా వెళ్ళి ‘రండి, కూర్చోండి’ అని అనగలిగినంత ధైర్యమూ సాహసమూ ఎక్కడిది! అమ్మకూడా యింట్లో లేదు. నాన్న సరేసరి! పగలల్లా ఆఫీసులోనే ఉంటాడు. ఎట్లా చెప్మా! యింట్లో ఎవ్వరూలేని సమయంలోనే వారు రావాలా? ఎవ్వరూలేకపోవడం ఏమిటి? తాను ఉందిగా! లేత గులాబీ రేకుల్లాంటి పెదిమలు చిరునవ్వుతో చిందేయి.

“వారొచ్చేరు! భోజనం టైముకు మరీవచ్చేరు! వారికి కావలసిన మంచిమంచికూరలూ, అవీ - వండాలి. యింటికి కొత్తల్లుడుకదూ! బాగా గౌరవించకపోతే వారేమనుకుంటారో? కాళ్లు కడుక్కోడానికి నీళ్లివ్వాలి. మంచినీళ్లుకావాలా?” అని అడగాలి.

“లక్ష్మి! లక్ష్మి! ముందు వారికి కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళియ్యి” అన్నాను కంగారుగా.

“బావకు నీళ్ళిచ్చేనుగా! కాళ్ళు కడుక్కొని కుర్చీలో కూర్చున్నాడు” అంది లక్ష్మి చిలిపిగా.

“అయితే ముందుగా నాతో చెప్పలేదే! ఎండవేళొచ్చేరు. మంచినీళ్ళు కావాలా?” అని అడిగేవా?

“నాకు తెలీదా అక్కా! మా బావకు ఉట్టి మంచి నీళ్ళిస్తే మర్యాదగా ఉండదని - ఎస్సెన్స్ - నాన్న తెచ్చేడు చూశావూ! అది కాస్త కలిపిచ్చేను.”

“నాకంటే ముందుగానే బావను సవరించుకున్నావన్నమాట! యిన్ని పనులూ చేస్తూ ముందుగా నాతో ఎందుకు చెప్పలేదే!”

“చెప్తామనుకుంటుంటే బావనన్ను వెళ్ళనిస్తేగా!”

“వెళ్ళనివ్వక చొక్కాను కట్టుకుని మూడేసుకున్నారా?”

“అదికాదే అక్కా! యీ సంగతి నీతో చెప్తామని వస్తూంటేనూ - మీ అక్క యింట్లో ఉందా? ఏంచేస్తోంది? ఎక్కడికైనా వెళ్లిందా? అని యక్షప్రశ్నల్లా లక్షప్రశ్నలు అడిగేరనుకో! సమాధానం చెప్పడానికి ఉక్కిరిబిక్కిరై పోయాను.”

“నన్నుగురించే అడిగేరా? “ఎప్పుడూ పొందని ఆనందం - ఆనాడే - ఆ ఒక్క నిముషంలోనే పొందినట్టయింది.” అయితే సమాధానం ఏమని చెప్పేవే? త్వరగా చెప్పవే?”

“ఊహూ! నేను చెప్పను” భీష్మించుకు పోయింది లక్ష్మి.

అయినా లక్ష్మి మరీ అల్లరి పిల్లయిపోయింది. దాని వేళాకోళానికి వేళాపాళా ఉండదు. అందులోనూ యిటువంటి సమయంలోనా పరిహాసం!

“చెప్పవే? నా ముద్దు చెల్లివికదూ? వారితో చెప్పి మంచి మొగుణ్ణికొని తీసుకురమ్మంటాను. చెప్పవూ?”

“పో! అక్కా నేను చెప్పను”

“నా చిన్నారివికదూ? నాతో చెప్పవూ?”

“చెప్తే ఏమిస్తావు?” చిలిపిగా అడిగింది.

“చెప్పడానికి లంచమా?”

“లంచంకాదే అక్కా! ‘లాంఛనం’ అట నాన్న చెప్పేవాడుకదూ? ఆఫీసులోని కాగితాలు తీసి

చూపించినందుకు అయిదు రూపాయలు లాంఛనం పుచ్చుకునేవాడినని !"

"నోర్మూయ్యవే ! ఆ పెద్దగొడవలన్నీ నీ కెందుకూ ? ముందు యీ సంగతి చెప్పవూ ? త్వరగా చెప్పమరి ' వారొక్కరే సావిట్లో కూర్చున్నట్టున్నారు"

"మరి నాలాంఛనం మాట ?"

"ఎక్కడ దొరికేవే నాకు ! సరే ! యీ బేడ కాసు తీసుకో. వారడిగితే నువ్వేమని చెప్పేవు ?"

"చెప్తున్నానుండుమరి ! నేను వీధిలో ఆడుకుంటూంటే బావచ్చేరే ! 'రండి బావగారూ' అని ఆహ్వానించేను. నీతో చెప్పకుండా 'నేనే సవిరించుకు పోవాలనుకుని కాళ్లు కడుక్కోడానికి నీళ్ళిచ్చి, డ్రింకిచ్చి ఎంత మర్యాద చేసేననుకున్నావ్ ! తర్వాత నన్ను దగ్గరకు రమ్మని పిలిచి 'లక్ష్మి అక్కేంచేస్తోంది ? యింట్లో ఉందా ?' అని నెమ్మదిగా అడిగేరే ! నాకు ఒక్కటే నవ్వు !"

"సరే ! దానికి నువ్వేమని చెప్పేవ్ !"

"నవ్వుతూ నేనేమని సమాధానం చెప్పేనో తెలుసా ?"

"త్వరగా చెప్పవే ?"

"అయినా పెళ్లాన్ని గురించి సిగ్గులేకుండా ఎవ్వరైనా అవిధంగా అడుగుతారటే ?"

"అడిగితే అడిగేరు. నువ్వుత్వరగా చెబుదూ ?"

"వచ్చి అయిదు నిముషాలన్నా కాలేదు. అప్పుడే పెళ్ళాం గురించి అంతబెంగ పెట్టుకు పోవాలా ?"

"దానికేంగానీ విషయం చెప్పవే ?"

"చెప్తాను ఉండుమరి ! ఏదో పెద్ద రహస్యం చెప్పినట్టు, ఎక్కడ నీకు వినిపిస్తోందని దగ్గరకుపిల్చి చెవిలో మరీ చెప్పేరు."

"అది సరే లేవే ! నువ్వేం చెప్పేవో అది చెప్పు !"

"మరదల్ని కాబట్టి సరిపోయిందిగానీ యీసంగతి అమ్మా నాన్నా వింటే ఎంతగా నవ్విపోతారో తెలుసా !"

"నవ్వితే నవ్వేరుగానీ యింతకూ నువ్వు చెప్పవన్నమాట !" "చెప్పక ఏంచేస్తాను లాంచనాలు కూడా పుచ్చుకున్న తర్వాత !"

"యీ సంగతి చుట్టు పక్కలమ్మలకు తెలిస్తే యీ అబ్బాయి పెళ్లాం పమిట కొంగును పట్టుకుని వదిలేలాలేనట్టున్నాడే ? అని గుసగుసలాడుకోరూ ?"

"అబ్బబ్బా ; చంపక చెప్తే చెప్పు లేకపోతే మానెయ్యి"

"అంతకోపం ఎందుకే అక్కా ! నీగురించి ఏమని చెప్పేనో తెలుసా !"

"తెలిస్తే, నిన్నగడం ఎందుకూ ?"

"నీకోసం కలవరించేస్తోంది బావా ? అనేశానే!"

"ఏమిటే నీ అల్లరి మరీను ! తప్పుకదూ ! అట్లా చెప్పవచ్చా !"

"పర్వాలేదులేవే _ బావేకదూ !"

"వారు వసారాలోనే కూర్చున్నట్టున్నారు. త్వరగా వెళ్లి అమ్మను కేకేసుకురా"

"చెప్పడం మర్చిపోయాను. ఏదో మిఠాయి పొట్లం, పువ్వులపొట్లం నా చేతికిస్తేనూ - వెర్రిబాగులదాన్ని నాకే అనుకున్నాను నేను - నాకు కాదట, 'మీ అక్కకియ్యి' అన్నారు. చూశావా ? పక్షపాత బుద్ధి ?"

"అవెక్కడ పెట్టేవే !

"కోపంవచ్చి మిఠాయి పొట్లం తినేశాను. పువ్వులపొట్లం బల్లమీద పెట్టేను. త్వరగా వెళ్లు మరి ! ఒక్కరే కూర్చున్నారు. నువ్వు వెళ్ళి పలుకరించకపోతే బాగుంటుందా ?"

"అవును నిజమే ! వచ్చి చాలాసేపయింది కూడాను. వెళ్ళి కనుపించకపోతే బాగుంటుందా మరి !" అంటూ నేను వసారాలోకి వెళ్ళేను కంగారుగా.

తీరా వెళ్లి చూచేసరికి యింకేముంది ? కుర్చీలో వారూ లేరూ ? బల్లమీద పువ్వులూ లేవు. ఎలక్షన్సులో డిపాజిట్టుపోయిన అభ్యర్థిలా అయిపోయింది నా ముఖం.

"వారెక్కడే ? కుర్చీలో కూర్చున్నారన్నావు ?" ఒకవేళ ఏ పనిమీదన్నా బజారుకి వెళ్లేరేమోనన్న అనుమానంకూడా లేకపోలేదు.

లక్ష్మి హేళనగా నవ్వుతోంది.

నాకు ఉడుకుమోత్తనం ఆగిందికాదు.

"ఉత్తిదే! అక్కా! వేళాకోళంగా అన్నాను. అంతే! అంది" లక్ష్మి.

"ఎంత నాటకం ఆడేవే! వంటింట్లో కూర్చున్న నన్ను ఎంతగా నమ్మించేవ్! వంగనాచివి. ఉండు అమ్మ వచ్చింతర్వాత నిన్నేంచేయిస్తానో "అంటూ బుర్రమీద ఒక్క మొట్టికాయ మొట్టేను.

"చెప్పుకో నాకేం! నా బేడా నాకు ముట్టిందిగా! అంటూ తలగోక్కుంటూ బైటికి వెళ్ళి పోయింది.

కాన వచ్చి వెలశినట్టయింది నాకు.

(మరోనాటి ఉదయం)

"అక్కా! అక్కా! బావచ్చేశారే!"

"వస్తే రానీ!"

"అమ్మనిన్ను కేకేస్తోంది"

"కేకేయనీ!"

"నిజంగానే! బావచ్చేరే!"

"వస్తే వెళ్లి నువ్వే పలకరించుకో!"

"మాపలకరింపులన్నీ అయ్యాయి-యింక నీ పలకరింపు లేతర్వాయి. త్వరగా రామరి!"

"రానని చెప్పు!"

"నా మాటనమ్మకపోతే మానెయ్యి. నాకేం!" అంటూ వసారాలోకి పరిగెత్తుకుపోయింది.

"లక్ష్మి నన్ను ఆడించడానికి మళ్ళీ యీ ఎత్తు వేసి ఉంటుందనుకున్నాను. ఒక వేళ నిజంగా వచ్చేరేమో! వస్తేరానీ! అమ్మ నాన్నా ఉన్నారుగా! పోనీ ఒక సారి వసారాలోకి వెళ్ళి చూద్దామని తల వంచుకుని నెమ్మదిగా గడపదాటబోయేసరికి నా తలకు మరోతల 'టంగ్'మని తగిలింది! తలపైకెత్తి చూచేసరికి యింకేముంది. వారే! నిజంగావారే! వచ్చేశారు! పాపం తలకు దెబ్బ తగిలిందేమో! అంత కళ్లు మూసుకుపోతూనడవాలా! అని కేక లేస్తారేమో! సిగ్గుతో తలవంచుకుని వెనక్కి తిరిగి వచ్చేశాను."

(ఆ నాటి రాత్రి)

"లక్ష్మీ! యిలారా?"

"ఎందుకు అక్కా!"

"నీకో మంచిమాట చెప్పాలి"

"ఏమిటో చెప్పవూ?"

"నువ్వు జార్జిటు సిల్కుజాకెట్టు కావాలన్నావు కదూ?"

"అవునక్కా! నాన్న తెచ్చేడా?"

"అబ్బే! వారేకొని తెచ్చేరు"

"ఏదీ? త్వరగా చూపించవే?"

"నీ కోసం ఎన్ని తెచ్చేరనుకున్నావ్! కాళ్లకు జోడూ ..."

"అమ్మో! అమ్మో! ఏదీ జోడు!"

"ఏదీ త్వరగా చూపించుమరి!"

"ఉండుమరి! ఆ జోడు కూటా కంపెనీదట. ఎన్నిరంగులున్నాయను కున్నావ్!"

"అక్కా! అక్కా! నా అక్కవుకదూ! చూపించవూ"

"నాకు తేకుండానే ముందు నీకే తెచ్చేరు, నువ్వంటే వారికి ఎంత అభిమానమో!"

"అవన్నీ ఎక్కడున్నాయి?"

"మొత్తం నలభై రూపాయలయిందటనీకు?"

"సరేలేవే! ముందు అవెక్కడున్నాయో చూపించు!"

"ఎప్పటినుంచో అడుగుతున్నావని నేనే తెమ్మన్నాను"

"గొప్పపనిచేశావు ముందుచూపించవే!"

"జాకెట్టు గుడ్డ యీ ఊళ్లో సరిగ్గాకుట్టరు పట్నం తీసుకువెళ్లి కుట్టించమని నాన్నతో చెప్పదాం"

"అబ్బబ్బా! వేపుకుతినేస్తున్నావ్! చూపిస్తే, చూపించు లేకపోతే మానెయ్యి" (ఏడుస్తుంది)

"ఏడవకుమరి! చేప్తున్నానుగా! నీకు నీలం జార్జిటు అంటే యిష్టమా! ఎర్రజార్జిటు అంటే యిష్టమా?"

"ఏదో ఒకటి యిష్టం. ముందు చూపించు. నీకు దణ్ణంపెడుతాను"

"అయితే ఆగదిలో ఉన్నాయి చూసుకో!" లక్ష్మి గదిలోనికి పరిగెత్తుకుపోయింది,

యింకా నాకు ఉడుకుమోత్తనం తీరలేదు.

లక్ష్మిగదిలోనికి వెళ్లడంతోనే యివతల తలుపు గొళ్లెం పెట్టేశాను.

లక్ష్మి తలుపు బాదుతూ,

"అక్కా! తలుపుతీయవే! యిక్కడ జోడూ లేదు, గుడ్డాలేదు. అంతా మోసం. బావ పడుకున్నగదిలోనికి నన్ను తోసి అవతల గొళ్లెంపెడతావా?

"బాటాజోడూ, జార్జిటు సిల్కు గుడ్డనచ్చేయా?"

"నచ్చడానికి ఉంటేగా! త్వరగా తలుపు తియ్యవే!"

"మరి మీ బావకు కాళ్లు కడుక్కోడానికి నీళ్లూ అవీ యిచ్చేవా!"

"నేను యివ్వలేదు బాబోయ్! తలుపు తియ్యవే!"

"మరి నాకు తెలీకుండా అన్నీ నువ్వే సవరించుకు పోతానన్నావుగా! నువ్వే సవరించుకో!"

"అమ్మో అమ్మో! తప్పయిపోయింది. ఇంకెప్పుడూ అననే! నిన్ను బ్రతిమాలుకుంటాను. తలుపు తియ్యవే!"

"నాగురించి బావతో యింకా ఏమేమి చాడీలు చెప్తావు?"

"ఏమి చెప్పలేదే! యింకెప్పుడూ చెప్పను. లెంపలు వాయించుకుంటాను. తలుపుతియ్యవే"

యింకచాలనుకుని తలుపు గొళ్లెం తీశాను. సిగ్గుతో లక్ష్మి గబగబా పరిగెత్తుకుపోయింది. నేను గదిలోనికి వెళ్లి గడియవేసుకున్నాను.

—(o)—

## రోజుకు నాలుగు గుడ్లు పెట్టే కోడిపెట్ట

ఒక కోడిపెట్ట రోజుకు నాలుగు గుడ్లను పెట్టింది. అది యఃలానో జరిగిపోయిన ఒక ప్రకృతి వైపరీత్యంకాదు. చైనా పూర్వోత్తర దిశలోని కిరిన్ రాష్ట్రానికి చెందిన చుంగ్‌చాన్ వ్యవసాయ కళాశాలవారు జరిపిన ప్రయోగాల ఫలితంగా ఇది సాధ్యమయింది.

ప్రయోగాల కోసం రెండువందల కోడి పెట్టలు తీసుకోన బడ్డాయి. మామూలుగా కోళ్లకు రోజుకు రెండు పర్యాయాలే మేతపెడతారు. ఈ కోళ్లకు రోజుకు ఐదు పర్యాయాలు మేతపెట్టబడింది. మామూలు మేతతోపాటు ప్రతికోడిపెట్టకు అదనంగా మరొకపౌను క్రిమిసంహారక మేత పెట్టబడ్డది. వాటిగూళ్లు శుభ్రంగా ఉంచబడుతూ ఉండేవి. పరిశుభ్రమైనగాలి సమృద్ధికరంగా వీచేటట్లు యేర్పాట్లు చేయబడ్డాయి. రోజుకు పద్దెనిమిదిగంటల పాటు కోళ్లకు వెలుగు లభించేటట్లు చేసారు. ఇందుకోసం సూర్యాస్తమానంతరం ఎలక్ట్రిక్ దీపాల వెలుగును ఉపయోగించేవారు.

ఇలా కల్పింపబడిన పరిస్థితుల్లో పదిరోజులు గడిచేకల్లా ఆకోడి పెట్టలు పెట్టే గుడ్ల సంఖ్య పెరగసాగింది. ఒక రోజునే కోళ్లు రెండులేదా, మూడు గుడ్లను పెట్టాయి. ఒకకోడి నాలుగుగుడ్లనుకూడా పెట్టింది. ఆ గుడ్లలో ఒక్కొక్కటి 207 గ్రాములబరువు ఉన్నది.